## 'మైక్రో ఫైనాన్స్' ఆర్డినెన్స్‌కు గవర్నర్ ఆమోదం

బెంగళూరు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మైక్రో ఫైనాన్స్ వేధింపుల నియంత్రణకు ప్రభుత్వం జారీ చేసిన ఆర్డినెన్స్‌కు గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోట్ ఆమోదం తెలిపినట్లు బుధవారం రాజ్‌భవన్ కార్యాలయం ప్రకటించింది. ఆర్డినెన్స్‌ను వారం క్రితం రాష్ట్ర ప్రభుత్వం రాజ్‌భవన్‌కు పంపగా పలు సందేహాలను ప్రస్తావిస్తూ వెనక్కిపంపిన విషయం తెలిసిందే. సందేహాలను నివృత్తి చేస్తూ మరోసారి రాజ్‌భవన్‌కు పంపారు. ఆర్డినెన్స్ బిల్లుపై రానున్న సమావేశాల్లో సమగ్రంగా చర్చించే అవకాశం ఉంది.


బెంగళూరు మహానగరం

# పాలికె.. చీలిక..!

- బీబీఎంపీని విభజించాల్సిందే
- ఐదు పాలికెలు, 500 వార్డులు
- 30 లక్షల జనాభాకొకటి..
- జాయింట్ కమిటీ నివేదిక సిద్ధం



బెంగళూరు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): బృహత్ బెంగళూరు మహానగర పాలికె (బీబీఎంపీ)ని విభజించాల్సిందేనని అప్పుడే పాలనా వ్యవహారాలు సరళీకృతం అవుతాయని, దశాబ్దకాలంలో అనూహ్యంగా విస్తరిస్తున్న నగరానికి అంతటికీ ఒకే పాలనా కేంద్రం సాధ్యం కాదని జాయింట్ కమిటీ అభిప్రాయానికి వచ్చింది. పాలనా నిర్వహణకోసం 30లక్షల జనాభాకు ఒకటి చొప్పున ఐదు పాలికెలను ఏర్పాటు చేసి నగర శివారు ప్రాంతాలను కలుపుకొని 500 వార్డులుగా గుర్తించాలని కమిటీ నిర్ణయించింది. ఇలా కీలకమైన అంశాలతో ప్రభుత్వ రిటైర్డు చీఫ్ సెక్రటరీ బీఎస్ పాటిల్ అధ్యక్షతన ఏర్పాటైన బీబీఎంపీ పునఃరచనా కమిటీ సుదీర్ఘంగా కసరత్తు జరిపి నివేదిక రూపొందించినట్లు తెలుస్తోంది. త్వరలోనే ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలని భావిస్తున్నారు. ఎమ్మెల్యే రిజ్వాన్ అర్షద్ అధ్యక్షతన శాసనసభ్యుల జాయింట్ యాక్షన్ కమిటీతోనూ చర్చలు జరిపారు. ఇదే నిర్ణయానికి ప్రభుత్వం అడుగు ముందుకేస్తే వార్డుల విభజన, పాలికెల ఏర్పాటు ప్రక్రియకు సుదీర్ఘ కాలం పట్టనుంది. దీంతో బీబీఎంపీకి ఇప్పట్లో ఎన్నికలు అసాధ్యమనిపిస్తోంది.


ప్రజాభిప్రాయ సేకరణను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రిజ్వాన్ అర్షద్, బీబీఎంపీ కమిషనర్ తుషార్ గిరినాథ్ తదితరులు

### వ్యతిరేకించిన ప్రతిపక్షాలు

బెంగళూరు నగరాభివృద్ధిశాఖ మంత్రిగా వ్యవహరిస్తున్న డీసీఎం డీకే శివకుమార్ గత ఏడాది జులైలో జరిగిన శాసనసభ సమావేశాల్లో గ్రేటర్ బెంగళూరు బిల్లుకు ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. దీంతో బిల్లుపై సమగ్రంగా చర్చించేందుకు 14మంది శాసనసభ్యులతో జాయింట్ యాక్షన్ కమిటీని ఏర్పాటు చేశారు. పాలికె ఎన్నికలకు సంబంధించి ఈనెల 25న సుప్రీంకోర్టులో పిటిషన్‌ను విచారించేందుకు ధర్మాసనం సుముఖత చూపడంతో గ్రేటర్ బెంగళూరు ప్రాధికారకు సంబంధించి ప్రజాభిప్రాయం, సలహాలు, సూచనలు స్వీకరించేందుకు సిద్ధమవుతున్నారు.


బీబీఎంపీ కార్యాలయం

### విభజనతోనే అభివృద్ధి..!

వార్డుల విభజనతోనే నగరాభివృద్ధి సాధ్యమని కొందరు వాదిస్తున్నారు. బీజేపీ పాలనలో వార్డుల సంఖ్యను 198 నుంచి 243కు పెంచారు. అయితే వార్డుల విభజనలో శాస్త్రీయ విధానాలు పాటించలేదని, బీజేపీకి అనుకూలమయ్యేలా వార్డులు విభజించారని కాంగ్రెస్ ప్రభుత్వం అభ్యంతరం తెలిపింది. వార్డుల సంఖ్యను 225కు కుదించారు. అయితే బీబీఎంపీ పునఃరచనా కమిటీ నివేదిక స్వీకరించాక విభజన విధానంపై ప్రభుత్వం యోచిస్తోంది. గ్రేటర్ బెంగళూరు ప్రాధికారకు సంబంధించి బిల్లులో ప్రస్తుతం ఒకటిగా ఉన్న బీబీఎంపీని 10 పాలికెలుగా విభజించడం, 400 వార్డులుగా ఏర్పాటు చేయాలని ప్రస్తావించారు. కమిటీ ప్రక్రియ సాగిస్తున్న తరుణంలోనే శాసనసభ వ్యవహారాల కమిటీ ఏర్పాటైంది. శాసనసభ్యుల జాయింట్ కమిటీ నగరజనాభా 1.50 కోట్లకు చేరుతున్న తరుణంలో ప్రస్తుతం 30లక్షలకు ఓ పాలికెను ఏర్పాటు చేయాలని, ఒక్కో పాలికెలో 100-125 వార్డులను చేయాలని తీర్మానించారు. గ్రేటర్ బెంగళూరు బిల్లులో మేయర్, డిప్యూటీ మేయర్‌ల పదవీకాలం ఐదేళ్లకు సిఫారసు చేశారు. మేయర్, డిప్యూటీ మేయర్‌ల అధికారం ప్రస్తుతం ఏడాదిమాత్రమే ఉన్నందున ఐదేళ్ల లేదా 30 నెలలు కొనసాగించాలని ప్రస్తావించారు. అయితే ఎటువంటి నిర్ణయానికి ప్రభుత్వం అంగీకరిస్తుందనేది వేచి చూడాలి. గ్రేటర్ బెంగళూరు ప్రాధికార, నగర పాలికెలు, వార్డు కమిటీలు అనే మూడు అంచెల పాలనా వ్యవస్థ ఉండనుంది. బీడీఏ, జలమండలి, బీఎంటీసీ, బీఎస్‌డబ్ల్యుఎంఎల్ (పారిశుద్ధ్య నిర్వహణ), బెస్కాంలు అన్ని గ్రేటర్ బెంగళూరు పరిధిలోకి రానున్నాయి. ప్రతి పాలికెలోనూ పాలన, విద్య, సామాజిక న్యాయ కమిటీ, ఆదాయం, ఆర్థిక వనరులు, పబ్లిక్ వర్క్స్, పబ్లిక్‌హెల్త్, అటవీ సంరక్షణ, పర్యావరణశాస్త్రం, చెరువులు, ఉద్యానవనం, పశుసంవర్ధక, టౌన్‌ప్లానింగ్, మౌలిక సదుపాయాలు, ఆడిట్ స్థాయి సమితులను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అధ్యక్షులు, సభ్యుల పదవీకాలం 30 నెలలు కొనసాగనుంది. ప్రతి స్థాయి సమితి కనీసం 5మంది, గరిష్ఠంగా 15మంది కౌన్సిల్‌నుంచే ఎంపిక చేస్తారు.

## గ్రేటర్ ముసుగులో ఎన్నికలు జాప్యమా..?


గ్రేటర్ బెంగళూరు ప్రాధికార ముసుగులో బీబీఎంపీ ఎన్నికలను జాప్యం చేయడం సమంజసమా అని ప్రతిపక్ష నాయకులు మండిపడుతున్నారు. గ్రేటర్ బెంగళూరు ప్రాధికార బిల్లుకు సంబంధించి ప్రజాభిప్రాయసేకరణ సభలు ప్రారంభమయ్యాయి. బెంగళూరు దక్షిణ ప్రాంతంలో బొమ్మనహళ్ళి, రాజరాజేశ్వరీనగర్‌లో సభలు మంగళవారం జరిగాయి. సమితి అధ్యక్షుడు ఎమ్మెల్యే రిజ్వాన్ అర్షద్ పర్యవేక్షణలో జరిగిన సభలో ప్రజలు భిన్నమైన అభిప్రాయాలు వ్యక్తం చేశారు. సమావేశంలో బీబీఎంపీ చీఫ్ కమిషనర్ తుషార్ గిరినాథ్, ఎమ్మెల్యే బైరతి బసవరాజ్, బీబీఎంపీ జాయింట్ కమిషనర్ దాక్షాయణి తదితరులు పాల్గొన్నారు. నగరానికి మేయర్ ఒక్కరే చాలు అని, మేయర్ పదవీకాలం పొడిగించాలని సూచించారు. లాటరీ ద్వారా వార్డు కమిటీ సభ్యులను ఎంపిక చేయాలని, నగర విస్తరణకు సంబంధించి స్పష్టత ఇవ్వాలన్నారు. బెస్కాం, జలమండలిని గ్రేటర్‌లో విలీనం చేయాలన్నారు. గ్రేటర్ బెంగళూరు పేరుకు బదులుగా 'మహాన్ బెంగళూరు'గా పెట్టాలన్నారు. గ్రేటర్ పేరుతో కొత్తగా విలీనం చేసే ప్రాంతాల్లో పన్నులు పెంచితే ప్రజలకు భారం అవుతుందని అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం 198 వార్డులకు ఎన్నికలు జరిపి ఆ తర్వాత గ్రేటర్ ప్రక్రియను అమలు చేయాలని కోరారు.

## ఎయిర్ షోలో అత్యాధునిక మెషీన్ గన్


మెషీన్‌గన్ పనితీరును వివరిస్తున్న శంకర్‌రెడ్డి

బెంగళూరు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఆర్మీ తయారు చేసిన ఆధునాతన మిషన్‌గన్‌ను ఎయిర్‌షోలో ప్రదర్శించారు. ఇందుకు సంబంధించి జమ్ము సెక్టార్‌లో ఆర్మీలో పనిచేస్తున్న శ్రీకాకుళంకు చెందిన శంకర్‌రెడ్డి ఎయిర్‌షో సందర్శకులకు వివరిస్తున్నారు. ఆటోమ్యాటిక్ మిషన్‌గన్ నేరుగా మనిషి ఉపయోగించాల్సిన అవసరం లేకుండా స్టాండ్‌కు ఒక చోట స్థిరంగా ఉంచి, దానికి అమర్చిన అత్యాధునిక లెన్స్ ద్వారా దూరంగా ఉండే లక్ష్యాన్ని ఛేధించేలా ఉపయోగించే వీలుంది. దీనివల్ల ఉపయోగించినవారికి ఎలాంటి హాని అవకాశం లేదు. ఇది ఉంచున్న చోటునుంచే లెన్స్‌తో వందలమీటర్ల దూరంలోని కదలికలను తెలియచేస్తుంది. కంప్యూటర్ కమాండ్ ద్వారా ట్రిగ్గర్ ఆటోమేటిక్‌గా టార్గెట్‌ను గురిచూసి నిమిషానికి 200 బుల్లెట్లను కురిపించి శత్రువులను హమారుస్తుందని శంకర్‌రెడ్డి వివరించారు. ఈ గన్ ఉపయోగించడం ద్వారా మనవైపు భారీ నష్టం లేకుండా శత్రువులను సులభంగా హతమార్చగలమని, దేశసరిహద్దుల్లో ఇది చాలా ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. దేశీయంగా ఇండియన్ ఆర్మీ తయారుచేసిన ఈ మిషన్‌గన్ మేక్‌ఇన్ ఇండియాలో భాగమైంది.

# శంభో శంకర..!


అశేష భక్తజనం నడుమ సాగుతున్న కోట మల్లేశ్వర స్వామి బ్రహ్మరథం, కోటమల్లేశ్వరుడు (ఇన్‌సెట్లో)

### శివనామ స్మరణతో మార్మోగిన బళ్లారి


### ఘనంగా కోట మల్లేశ్వర స్వామి బ్రహ్మరథోత్సవం

ఓంకార నాదం ప్రతిధ్వనించింది.. శివ నామస్మరణతో భక్తులు పులకించారు. బళ్లారి నగర ఆరాధ్యదైవమైన కోట మల్లేశ్వర స్వామి రథోత్సవం బుధవారం సాయంత్రం అంగరంగ వైభవంగా సాగింది. ఇసుక వేస్తే రాలనంతగా భక్త జనం పాల్గొని జోడి అరటిపండ్లు రథంపైకి విసురుతూ మొక్కులు తీర్చుకున్నారు.

8

## కాంగ్రెస్‌కు కొత్త సారథి..!

- పార్టీ అధ్యక్షుడి మార్పుపై జోరుగా ఊహాగానాలు
- ఢిల్లీ నేతలతో మంత్రి సతీష్ జార్కిహొళి భేటీ



బెంగళూరు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గ్రూపు విభేదాలతో పాటు నాయకత్వ మార్పు, రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడిగా కొత్తవారికి అవకాశం ఇవ్వాలనే చర్చలు సాగుతున్న తరుణంలోనే రాష్ట్ర ప్రజాపనుల శాఖా మంత్రి సతీశ్ జార్కిహొళి రెండు రోజులుగా ఢిల్లీలో మకాం వేశారు. రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే, ప్రధానకార్యదర్శి కేసీ వేణుగోపాల్‌లను కలిశారు. ఆయన ఏ అంశాలపై చర్చలు జరిపారనేది అంతుచిక్కని రహస్యంగా మారింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన పార్టీ అంశాలపై చర్చలు జరిగినట్లు తెలుస్తున్నా త్వరలోనే మంత్రివర్గ విస్తరణతో పాటు రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడిని మార్పు చేయాలనే డిమాండ్ సాగుతున్న తరుణంలోనే సతీశ్‌జార్కిహొళి ఢిల్లీ వెళ్ళడం రాష్ట్ర రాజకీయాల్లో కుతూహలంగా మారింది. ఇదే సందర్భంలోనే సహకార శాఖా మంత్రి రాజణ్ణ కూడా ఢిల్లీ వెళ్ళడం ఆసక్తి రేకెత్తిస్తోంది. వీరిద్దరూ మంత్రులు సీఎం సిద్దరామయ్య గ్రూపునకు చెందినవారనే పేరుంది. పలు సందర్భాల్లో డీకే శివకుమార్ వ్యాఖ్యలకు తిప్పికొట్టేలా మాట్లాడిన సందర్భాలు ఉన్నాయి. జనవరి మొదటి వారంలో హోంమంత్రి పరమేశ్వర్ ఏర్పాటు చేసిన దళిత మంత్రులకు విందు రాజకీయంగా మారుతుందనే కారణంతో గంటల వ్యవధిలో అధిష్టానం బ్రేక్ పెట్టిన తర్వాత తాజాగా అటువంటి విందు భేటీలకు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఇదే సమయంలోనే సతీశ్ జార్కిహొళి ఢిల్లీ వెళ్ళడం, మరో వైపు హోంమంత్రి పరమేశ్వర్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలవడంతో రాజకీయంగా చర్చలు జోరందుకున్నాయి.

## గంటలకొద్దీ రోడ్లపైనే..!

- ట్రాఫిక్ నియంత్రణలో పోలీసుల విఫలం
- ఎయిర్ షో మార్గంలో వాహనదారులకు తప్పని కష్టాలు

బెంగళూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): నగరంలో ప్రతిష్ఠాత్మకంగా జరుగుతున్న ఎయిర్‌షో ప్రదర్శనకు సందర్శకులు పోటెత్తుతుండగా ట్రాఫిక్ రద్దీకూడా అదేరీతిన పెరిగినా నిభాయించడంలో విఫలం కావడంతో వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎయిర్‌షో రెండేళ్లకోసారి జరిగే విమానాల పండుగ. ఇది డిఫెన్స్ అంటే రక్షణశాఖకు సంబంధించిన విమానాలు, హెలికేప్టర్‌లు, డ్రోన్‌లు వంటి విన్యాసాలు ప్రదర్శించడం ఆనవాయితీ. ప్రజలకు ఈ విభాగంలో ఆసక్తిగల విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుంది. ప్రతి రెండుసంవత్సరాలకోసారి జరుగుతున్న దీన్ని నిర్వహించడంలో ఎయిర్‌షో ప్రదర్శనలు విజయవంతమైనా స్థానిక ప్రభుత్వం మౌలిక సదుపాయాలు కల్పించడంలో పూర్తిగా విఫలం చెందుతోంది. దేశవిదేశాల నుంచి ఎయిర్‌షోలో పాల్గొనడానికి, వీక్షించడానికి స్థానికులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. ముందుగా తెలిసినా అరకొర ఏర్పాట్లు మాత్రమే చేపట్టారనే విమర్శలు ఉన్నాయి. హెబ్బాళ్ నుంచి ఎయిర్‌షోకుగానీ, ఎయిర్‌పోర్ట్‌కుగానీ హైదరాబాద్‌కు వెళ్లే వాహనదారులకుగానీ నరకాన్ని చూపిస్తున్నారు. యలహంక ఎయిర్‌బేస్‌లో ఎయిర్‌షో కొనసాగుతోంది. ఎయిర్‌షో జరిగే రోజుల్లో హెబ్బాళ్ నుంచి సుమారు 10కిలోమీటర్ల దూరంలోని ఎయిర్‌షో ప్రదేశానికి చేరుకునేందుకు 2-3 గంటల సమయం పడుతోందంటే ఎంత రద్దీ ఉందో అర్థం చేసుకోవచ్చు. ఎయిర్‌షోకు కొంతముందు ప్రణాళికలు వేసి ట్రాఫిక్‌కు కొన్ని ఇతర మార్గాల్లో మళ్ళించి, ఎయిర్‌పోర్ట్‌కు వెళ్లే వాహనాలకు ఇబ్బందిలేకుండా చేయడం ముఖ్యం, పర్యవసానంగా ఎంతోమంది ఫ్లైట్ మిస్ కావడం పరిపాటి. ఎయిర్‌షో చివరి రెండు రోజులు సామాన్య ప్రజలకు కూడా అనుమతించడం ద్వారా మరింత ఇబ్బందిపడ్డం ఖాయంగా తెలుస్తోంది. ట్రాఫిక్‌రద్దీ దృష్ట్యా ఎయిర్‌పోర్ట్‌కు వెళ్లదలిచినవారు ఇతర మార్గాల్లో వెళ్లడం ఉత్తమమని పలువురు అభిప్రాయపడుతున్నారు. 2027 ఎయిర్‌షో ప్రదర్శనలకైనా ఇతర మార్గాలను అన్వేషించి ట్రాఫిక్‌ను నిభాయించేలా చర్యలు చేపట్టాలని ప్రజలు, వాహన చోదకులు కోరుతున్నారు.


హెబ్బాళ్ మార్గంలో ఆగిపోయిన వాహనాలు

## ఉదయగిరి గొడవలలో పోలీసుల నిర్లక్ష్యం లేదు: డీకే



బెంగళూరు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మైసూరు నగరం ఉదయగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి జరిగిన గొడవల వేళ పోలీసుల తప్పులేదని డీసీఎం డీకే శివకుమార్ అభిప్రాయపడ్డారు. బుధవారం బెంగళూరులో ఆయన మీడియాతో మాట్లాడుతూ గొడవ సమయంలో పోలీసులు సక్రమంగా వ్యవహరించారని డీసీఎంగా చెబుతున్నా వారిది ఎటువంటి తప్పులేదన్నారు. సంఘటనకు పోలీసుల నిర్లక్ష్యమే కారణమని సహకార శాఖా మంత్రి రాజణ్ణ వ్యాఖ్యానించగా అందుకు భిన్నంగా డీసీఎం స్పందించారు. గాయపడినా పోలీసులు సమన్వయంగా వ్యవహరించారన్నారు. పోలీసు అధికారులు, ఓ వర్గానికి చెందిన నాయకులతో పాటు మీడియా నుంచి వివరాలు తెలుసుకున్నట్లు వివరించారు. కొందరు మత పెద్దలు గొడవ జరుగకుండా ప్రయత్నించారని కానీ వందలాదిమంది గుంపుగా చేరి వీరంగం చేశారన్నారు. గొడవలకు కారకులైన వారిని గుర్తించే ప్రక్రియ సాగుతోందన్నారు. మంత్రి రాజణ్ణ తన కంటే పెద్దవారు ఆయన వ్యాఖ్యలకు ముఖ్యమంత్రి వివరణ ఇస్తారన్నారు. ప్రయాగ్‌రాజ్ మహాకుంభమేళాతో పాటు టీ నరసీపుర త్రివేణి సంగమంలో స్నానం చేయడంలో వ్యత్యాసం ఏమీ అనిపించలేదని పరిశుభ్రం, పవిత్రత ఉందన్నారు.

### ఎనిమిది మంది అరెస్టు

ఉదయగిరి పోలీస్‌స్టేషన్‌పై రాళ్లదాడికి సంబంధించిన కేసులో మైసూరు సీసీబీ పోలీసులు ఎనిమిది మందిని బుధవారం అరెస్టు చేశారు. వీరిలో సయ్యద్ సుహైల్, రహీల్‌పాషా, ఎజాజ్, సయ్యద్ సారిక్, సాదిక్‌పాషా, అర్బాజ్ షరీఫ్, షోయబ్‌పాషా సహా 8మందిని అరెస్టు చేశారు. గొడవలకు ప్రధాన కారకులుగా భావిస్తున్న వ్యక్తి కోసం గాలింపులు జరుపుతున్నట్టు సమాచారం.

క్రైం కార్నర్

## గుత్తి ఆర్‌ఎస్‌లో సైకో వీరంగం

● దేహశుద్ధి చేసిన స్థానికులు



సైకోను తాళ్లతో కట్టేసిన స్థానికులు

గుత్తి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): గుత్తిఆర్‌ఎస్‌లో బుధవారం ఓ సైకో వీరంగం సృష్టించాడు. నడిరోడ్డుపై బట్టలు విప్పి నగ్నంగా తిరుగుతూ దుకాణాలపై రాళ్లు విసురుతూ జనాలను భయభ్రాంతులను చేశాడు. పత్తికొండ రోడ్డు సర్కిల్లో ఓ మటన్‌దుకాణంపై దాడికి పాల్పడేందుకు ప్రయత్నించగా స్థానికులు పట్టుకున్నారు. దేహశుద్ధి చేసి కాళ్లు చేతులు కట్టేసి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఆ సైకోను వాహనంలో తీసుకెళ్లి ఇతర ప్రాంతానికి తరలించారు. దీంతో స్థానిక ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. దాదాపు ఆరగంటపాటు సైకో వీరంగం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. అతడు తిరుపతికి చెందినవ్యక్తి అని సమాచారం.

## వెంటాడిన మృత్యువు



రామాంజనేయులు (ఫైల్)

కుందుర్పి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొలిమిపాల్యం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు బోయ రామాంజనేయులు (53)ను మృత్యువు వెంటాడింది. ఇంటి పైనుంచి పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఆస్పత్రికి తరలిస్తుండగా.. రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు వెంటాడింది. వారం రోజులపాటు పోరాడి చివరకు ప్రాణం విడిచాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బోయ రామాంజనేయులు కూలి పనులకు వెళ్లుండేవాడు. అతడికి భార్య లక్ష్మీదేవి, కుమారుడు అనిల్ ఉన్నారు. ఈనెల 4వ తేదీన ఇంటి పైకప్పు మీద ఉన్న కోడిపెంటను శుభ్రం చేస్తుండగా.. ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. నడుము వద్ద తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స కోసం అనంతపురం తీసుకెళ్లారు. 5వ తేదీన తెల్లవారుజామున మెరుగైన వైద్యం కోసం ప్రైవేటు అంబులెన్సులో కర్నూలుకు తరలిస్తుండగా వెల్దుర్తి సమీపంలో టోల్ ప్లాజా వద్ద రోడ్డు సూచికను ఢీకొట్టారు. ప్రమాదంలో రామాంజనేయులుకు తీవ్ర గాయాలయ్యాయి. అంబులెన్స్ డ్రైవర్‌తోపాటు రామాంజనేయులు భార్య లక్ష్మీదేవి, కుమారుడు అనిల్, మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. వారిని కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రామాంజనేయులు మంగళవారం మృతిచెందాడు. కర్నూలు జిల్లా కృష్ణగిరి పోలీసులు బుధవారం కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు.

## అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

లేపాక్షి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక మండలంలోని కొండూరు గ్రామానికి చెందిన రైతు నరసింహమూర్తి(32) బుధవారం ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. నరసింహమూర్తి గ్రామంలో వ్యవసాయంతోపాటు కూలిపని చేసుకుంటూ జీవించేవాడు. ఇటీవల ఫైనాన్స్‌లో ద్విచక్ర వాహనం కొనుగోలు చేశాడు. దానికి కంతులు కట్టకపోవడంతో మూడు రోజుల కిందట వాహనాన్ని ఫైనాన్స్ వారు తీసుకెళ్లారు. దీంతో జీవితంపై విరక్తిచెంది బుధవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లి దగ్గరలోనే ఉన్న చింతచెట్టుకు ఉరి వేసుకున్నాడు. గమనించిన స్థానికులు ఉరికి వేళాడుతున్న అతడిని కిందకి దించి పరీక్షించగా మృతి చెందినట్లు గుర్తించారు. మృతుడికి భార్య, తల్లిదండ్రులు ఉన్నారు. భార్య శోభ ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా మృతుడికి దాదాపు రూ.ఐదారు లక్షలు అప్పులు ఉన్నట్లు స్థానికులు తెలిపారు.

## నేలకోట తండాలో కూలీ..

ధర్మవరంరూరల్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని నేలకోటతండాకు చెందిన వ్యవసాయ కూలీ నాగభూషణనాయక్(50) బుధవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన మేరకు నాగభూషణనాయక్ వ్యవసాయ కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు. రెండురోజుల కిందట భార్య కృష్ణమ్మబాయి తమ కుమార్తె ఇంటికి వెళ్లడంతో మనస్తాపం చెంది పురుగులమందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. స్థానికులు గమనించి ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి, మృతి చెందినట్లు నిర్ధారించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని, శవాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

## ప్రింటింగ్ ప్రెస్ యజమాని..

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసై.. మనస్తాపంతో ఓ ప్రింటింగ్ ప్రెస్ నిర్వాహకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. వన్‌టౌన్ సీఐ రాజేంద్రనాథ్ యాదవ్ తెలిపిన మేరకు.. నగరంలోని కమలానగర్‌లో చంద్రశేఖర్ (50) భవాని ప్రింటింగ్ ప్రెస్ నిర్వహిస్తున్నాడు. మద్యానికి అలవాటు పడిన చంద్రశేఖర్‌కు కుటుంబ సభ్యులు మానుకోవాలని సూచించేవారు. ఈ క్రమంలో బుధవారం కింద ప్రింటింగ్ ప్రెస్‌లో భార్య, ఇతర కుటుంబసభ్యులు ఉండగా పై గదిలోకి వెళ్లిన చంద్రశేఖర్ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆలస్యంగా గమనించిన కుటుంబ సభ్యులు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## బావిలో పడి యువకుడి మృతి

చిలమత్తూరు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని హుస్సేన్ పురంలో నాగరాజు (32) ప్రమాదవశాత్తు పాడుబడిన బావిలో పడి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడు నాగరాజు కూలి పనులు చేసుకుంటూ ఉండేవాడని, అందులో భాగంగా మంగళవారం కూలి పనికి వెళ్లాడన్నారు. అయితే పనిచేస్తున్న చోట బహిర్భూమికి వెళుతున్నట్లు అక్కడున్న వారికి చెప్పి వెళ్లాడన్నారు. అయితే అతను ఎంత సేపటికి రాకపోవడంతో అనుమానం వచ్చి చుట్టుపక్కల గాలించినా ప్రయోజనం లేకపోయింది. అయితే బుధవారం ఉదయం పొలంలో వ్యవసాయ పనులకు వెళ్లిన వారికి పాడుబడిన బావిలో శవమై కనిపించడంతో వారు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. మృతుడి తండ్రి శివప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.

# ఉద్యోగోన్నతి కోసం.. నిరీక్షణ..!



● ఐదేళ్లుగా వార్డెన్ల ఎదురుచూపు

● ఒకరి వల్ల పది మందికి ఇబ్బందులు

● ఎస్సీ సంక్షేమశాఖలో ఉన్నతాధికారుల నిర్లక్ష్యం

అనంతపురం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఏ ప్రభుత్వ శాఖలోనైనా ఉద్యోగికి అంచలంచెలుగా పదోన్నతులు ఉంటాయి. పదోన్నతి ద్వారా హోదా, జీతంతో పాటు ఇతర అలవెన్సులు వల్ల లబ్ధి చేకూరుతుంది. ఎస్సీ సంక్షేమశాఖలో ఉద్యోగోన్నతి విషయంలో ఉన్నతాధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. కలెక్టర్‌కు మొర పెట్టుకున్నా ఆ ఉద్యోగులకు న్యాయం జరగడం లేదు. ఎన్నేళ్లిలా ఉద్యోగోన్నతి కోసం నిరీక్షించాలో బదులిచ్చే నాథుడే కరువయ్యారు. ఎస్సీ సంక్షేమశాఖలో ఉమ్మడి అనంత జిల్లాలో పనిచేస్తున్న 10 మంది వార్డెన్ల ఉద్యోగోన్నతి విషయంలో ఉన్నతాధికారుల తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆ శాఖ నిబంధనల మేరకు వార్డెన్లకు గ్రేడ్-1 వార్డెన్(ఏఎస్‌డబ్ల్యూఓ)గా ఉద్యోగోన్నతి పొందడానికి అర్హులు. ఉద్యోగోన్నతి పొందాలంటే తప్పనిసరిగా బీఈడీ పూర్తి చేసి ఉండాలి. సీనియార్టీ జాబితాలో ఉన్న 10 మంది వార్డెన్లు బీఈడీ పూర్తి చేశారు. అదే శాఖలో పనిచేస్తున్న క్లాస్-4 ప్రమోటెడ్ వార్డెన్ తనకూ గ్రేడ్-1 వార్డెన్‌గా ఉద్యోగోన్నతి కల్పించాలంటూ కోర్టును ఆశ్రయించాడు. అతడు సీనియార్టీ జాబితాలో 30వ స్థానంలో ఉండటంతో పాటు... ఆ శాఖ నిబంధనల మేరకు బీఈడీ అర్హత లేదని ఆ శాఖ అధికారులే స్పష్టం చేస్తున్నారు. అర్హత లేకపోయినా గ్రేడ్-1 ఉద్యోగోన్నతి కల్పించాలని కోర్టుకు వెళ్లిన వార్డెన్‌ను సాకుగా చూపుతూ మిగిలిన వారికి అన్యాయం చేసే విధంగా ఆ శాఖ ఉన్నతాధికారులు వ్యవహరిస్తుండటం విమర్శలకు దారితీస్తోంది.

### ఆ ఇద్దరు అధికారుల వ్యవహారమే శాపమా...?

ఉమ్మడి అనంతపురం జిల్లాలో 10 మంది వార్డెన్లకు ఉద్యోగోన్నతులు రాకపోవడానికి గతంలో ఆ శాఖ ఉన్నతాధికారులుగా పనిచేసిన ఇద్దరి నిర్వాకమే ప్రధాన కారణమని తెలుస్తోంది. ఆ ఉన్నతాధికారుల వ్యవహారశైలితో 10 మంది వార్డెన్లకు శాపంగా మారిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో పనిచేసిన ఆ ఇద్దరు ఉన్నతాధికారులు మహిళా, పురుష ఉద్యోగుల సీనియార్టీ జాబితాను వేర్వేరుగా రూపొందించడంతోనే సమస్య ఉత్పన్నమైందని తెలుస్తోంది. వారిద్దరి ప్రోత్సాహంతోనే ఓ వార్డెన్ కోర్టును ఆశ్రయించారనే ఆరోపణలు ఉన్నాయి. ఆ ఇద్దరు అధికారుల తీరుపై రాష్ట్రస్థాయి అధికారులు సీరియస్ అయ్యారని సమాచారం. వేర్వేరుగా పదోన్నతుల సీనియార్టీ జాబితాను రూపొందించడంపై విచారణకు ఆదేశించారు. ఆ క్రమంలోనే ఆ రెండు జాబితాలను రద్దు చేశారు. ఇదిలా ఉండగా.. గ్రేడ్-1 వార్డెన్ ఉద్యోగోన్నతి కల్పించాలని కోర్టును ఆశ్రయించిన కేసు విచారణకు వచ్చింది. ఆ సమయంలో ఆ శాఖ రాష్ట్ర అధికారులైనా... జిల్లా ఉన్నతాధికారులైనా పట్టించుకొని కౌంటర్ ఫైలు చేసి ఉంటే... 10 మంది వార్డెన్లకు గ్రేడ్-1 ఉద్యోగోన్నతులు కలిగేవి. ఆ శాఖ రాష్ట్రస్థాయి అధికారులు, జిల్లా అధికారులు ఆ విషయంలో మీనమేషాలు లెక్కించడంతో ఐదేళ్లు గడుస్తున్నా... వారికి కోసం ఎదురుచూపులే మిగిలాయి.

### కలెక్టర్‌కు సర్వాధికారాలున్నా...

ఉద్యోగోన్నతుల విషయంలో జిల్లా కలెక్టర్‌కు సర్వధికారాలు ఉంటాయి. ఒక్కరి కోసం... 10 మంది వార్డెన్లకు ఉద్యోగోన్నతులు కల్పించే విషయంలో నిర్ణయం తీసుకోలేకపోతున్నారనే విమర్శలు ఉన్నాయి. ఉద్యోగోన్నతి కల్పించాలని విజ్ఞప్తి చేస్తూ స్పందనలో కలెక్టర్‌కు పలుమార్లు మొర పెట్టుకున్న సందర్భాలు లేకపోలేదు. లిఖితపూర్వకంగా వినతులు సమర్పించినా.. వారి మొర ఆలకించకపోగా.. జీపీ నివేదిక తీసుకురావాలని ఆదేశాలు జారీ చేశారు. ఆ మేరకు ఆ శాఖ అధికారులతో కలిసి ఆ 10 మంది వార్డెన్లు జీపీ నివేదికను కలెక్టర్‌కు అందజేసినట్లు సమాచారం. గ్రేడ్-1 పదోన్నతులు కల్పించేందుకు ఆ 10 మంది వార్డెన్లు అర్హులని అందులో స్పష్టంగా పేర్కొన్నట్లు తెలుస్తోంది. అయినప్పటికీ.. ఉద్యోగోన్నతి కోసం కోర్టుకెళ్లిన ఆ వార్డెన్ కేసు విత్‌డ్రా చేసుకుంటే సమస్య పరిష్కరిస్తామని స్వయంగా కలెక్టరే తేల్చి చెప్పినట్లు బాధిత వార్డెన్ల ద్వారా తెలుస్తోంది. కోర్టుకెళ్లిన ఆ క్లాస్-4 వార్డెన్ మాత్రం కేసు వెనక్కు తీసుకునేది లేదని భీష్మించుకు కూర్చోవడంతో చిక్కుముడి వీడలేదు. ఇక్కడ మరో విషయం తెరపైకి వస్తోంది. ఆ పదిమందిలో వరుసగా సీనియార్టీ జాబితాలో 9 సంఖ్య వరకూ ఉన్న వారికి గ్రేడ్-1 వార్డెన్లుగా పదోన్నతి కల్పించి ఆఖరి వార్డెన్‌కు ఆపడం వల్ల... ఆ 9 మందికైనా న్యాయం జరుగుతుందనే వాదన ఆ వర్గాల నుంచి వినిపిస్తోంది. తర్వాత కోర్టు తీర్పు ఎవరికి అనుకూలంగా వస్తే... ఆ వార్డెన్‌కు ఉద్యోగోన్నతి కల్పించవచ్చని అంటున్నారు. ఇతర జిల్లాల్లో ఇదే పద్ధతిని అనుసరించారని అంటున్నారు. జిల్లాలో ఆ విధానం పాటించడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

## కొండంత పండుగ

● వైభవంగా కొండమీదరాయుడి రథోత్సవం

● భక్తజనంతో కిటకిటలాడిన బుక్కరాయసముద్రం

● ప్రతిధ్వనించిన గోవింద నామం



ఉత్సవమూర్తులు

బుక్కరాయసముద్రం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): గోవింద నామస్మరణతో బుక్కరాయసముద్రం ప్రతిధ్వనించింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా కొండమీదరాయుడి రథోత్సవం బుధవారం అశేష జనవాహిని నడుమ కన్నుల పండువగా సాగింది. దేవదేవుడి వైభవాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఉభయ దేవేరులతో సూర్యతేజ వాహనంపై ఆశీనులైన స్వామి వారు భక్తుల విశేష పూజలు అందుకున్నారు. మహా రథోత్సవాన్ని తిలకించడానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచే కాకుండా రాష్ట్రంలోని పలు జిల్లాలు, కర్ణాటక రాష్ట్రం నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. అంతకుముందు స్థానిక లక్ష్మీనారాయణస్వామి దేవాలయంలో భూదేవి, శ్రీదేవి అమ్మవార్లకు స్వామి వారితో కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం సూర్య ప్రభ వాహనంపై స్వామివారిని కొలువు తీర్చి పల్లకీసేవ లో దివ్యరథం వద్దకు చేర్చారు. రథోత్సవం వద్ద వేద పండితులు హోమం ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుల వేద మంత్రలా నడుమ స్వామి ప్రతిమను ఉత్సవ రథంపై ప్రతిష్ఠించారు. స్వామి వారి దివ్య రథానికి ఎమ్మెల్యే బండారుశ్రావణీశ్రీ గుమ్మడికాయతో దిష్టి తీశారు. ఉదయం 11:38 నిమిషాలకు భక్తులు మడుగుతేరును స్థానిక అంజనేయ స్వామి దేవాలయం వద్దకు లాగారు. సాయంత్రం 4గంటలకు అక్కడి నుంచి బ్రాహ్మణ వీధి వరకు లాగి యథాస్థానానికి చేర్చారు. దీంతో కొండమీదరాయుడు బ్రహ్మోత్సవాల ప్రధాన ఘట్టం ముగిసింది.

## రక్తదానంతో ప్రాణదాతలుగా నిలవండి

● ఆర్టీసీ రీజనల్ మేనేజర్ సుమంత్

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): సమాజంలోని ప్రతిఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని ఆర్టీసీ రీజనల్ మేనేజర్ సుమంత్ పిలుపునిచ్చారు. ఆర్టీసీ రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని బుధవారం రెడ్‌క్రాస్ సొసైటీ కార్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అనంతపురం రీజియన్‌లోని వివిధ డిపోల నుంచి 63 మంది సిబ్బంది హాజరై రక్తదానం చేశారు. అనంతరం రక్తదాతలందరికీ ఆర్ఎం ప్రశంసాపత్రాలు అందజేశారు. అనంతరం ఆర్ఎం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరు నెలలకోసారి రక్తదానం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్టీసీ మెడికల్ ఆఫీసర్ రాజేంద్రప్రసాద్, రెడ్‌క్రాస్ వైద్యులు లక్ష్మణ్ ప్రసాద్, శంకర్‌గౌడ్, అనంతపురం డీఎం నాగభూపాల్ తదితరులు పాల్గొన్నారు.

## చీనీ సీజన్ ప్రారంభం

● మార్కెట్‌కు పెరుగుతున్న దిగుబడులు



మార్కెట్‌కు వచ్చిన చీనీ కాయలు

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఆలస్యంగా చీనీ సీజన్ పారంభమైంది. అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులోని చీనీ మార్కెట్‌కు చీనీ దిగుబడులు కాస్త పెరిగాయి. గత నాలుగైదు రోజుల నుంచి 40 టన్నులకు పైగా కాయలు మార్కెట్‌కు వస్తున్నాయి. మార్కెట్‌కు బుధ వారం 45టన్నుల చీనీ కాయలు వచ్చాయి. టన్ను గరిష్ఠ ధర రూ.21,850, కనిష్ఠ ధర రూ.5వేలు, సరాసరి రూ.11వేలతో అమ్ముడు పోయాయి. చీనీ సీజన్ ప్రారంభం కావడంతో మార్కెట్‌లోని వ్యాపారులు మండీలను ఒక్కొక్కటిగా ప్రారంభిస్తున్నారు. గత వారం రోజుల నుంచి ఈ ప్రక్రియ సాగుతోంది. కాగా ఇప్పటికీ మహారాష్ట్ర, తెలంగాణ తదితర ప్రాంతాల్లో స్థానికంగా చీనీ ఉత్పత్తులు మార్కెట్‌కు వస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో కాయలను మార్కెట్‌కు తెచ్చేందుకు ఉమ్మడి జిల్లా రైతులు వేచిచూసే ధోరణిలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈక్రమంలో మార్కెట్‌కు చీనీ కాయల రాక మరికొంత ఆలస్యం అయ్యే అవకాశం ఉందని మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు చెప్పుకొచ్చారు.

## మంటల్లో చిక్కుకుని వృద్ధుడి మృతి

లేపాక్షి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఆకతాయిలు అంటించిన మంటల్లో చిక్కుకుని వృద్ధుడు మృతిచెందిన సంఘటన లేపాక్షిలో చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు.. లేపాక్షి ప్రధాన ఆలయం వెనుక పిచ్చి మొక్కలు, గడ్డి ఏపుగా పెరిగింది. కొంతమంది ఆకతాయిలు బుధవారం సాయంత్రం 4గంటల ప్రాంతంలో పిచ్చిమొక్కలకు అగ్గిపెట్టారు. లేపాక్షి గ్రామానికి చెందిన మాబుసాబ్(87) పొలంవద్ద నుంచి అటుగా వస్తున్నాడు. అతడికి కళ్లు సరిగా కనబడకపోవడంతో మంటల్లో చిక్కుకున్నాడు. అక్కడే పిచ్చిమొక్కలు, గడ్డివాములు ఉండటంతో మంటలు అధికమై అందులో ఇరుక్కుని పూర్తిగా కాలిపోయాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతుడికి భార్య కుమారుడు, కుమార్తె ఉన్నారు.



రథం లాగుతున్న భక్తులు

## ఘనంగా రంగనాథుడి రథోత్సవం

గుత్తిరూరల్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొండపాడులో వెలసిన బొలికొండ రంగనాథస్వామి కల్యాణం, రథోత్సవం బుధవారం ఘనంగా జరిగాయి. తెల్లవారుజామున శ్రీదేవి, భూదేవితో రంగనాథస్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం రుద్రాపారాయణం హోమాలు, మహామంగళ హారతులిచ్చారు. ఆలయంలో స్వామివారికి అర్చకులు పంచామృతాభిషేకం చేసి వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. అనంతరం స్వామివారి రథాన్ని వివిధ రకాల పుష్పాలతో అలంకరించి, శ్రీదేవి, భూదేవి సమేత బొలికొండ రంగనాథస్వామి ఉత్సవమూర్తులను కొలువుదీర్చారు. సాయంత్రం గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం టెంకాయ కొట్టి రథాన్ని లాగారు. భక్తులు రథంపైకి అరటి పండ్లు బెల్లం తీపి బెండ్లను విసిరి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రామాంజునేయులు, ఆలయ కమిటీ ఛైర్మన్ రంగస్వామి రెడ్డి యాదవ్, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు. కాగా రథోత్సవం సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి ప్రత్యేక అలంకరణతో వచ్చిన ఎద్దుల బండ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.



పెళ్లి పీటలపై స్వామి, అమ్మవార్లు

## నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంబ్...

### సరోజినీ నాయుడు (జయంతి)



నైటింగేల్ ఆఫ్ ఇండియా (భారత కోకిల)గా పేరొందిన సరోజినీ నాయుడు 1879 ఫిబ్రవరి 13న హైదరాబాద్‌లో జన్మించారు. రచయిత, ప్రముఖ రాజకీయ నేతగా ఆమె రాణించారు. మహాత్మా గాంధీ మార్గంలో ఆమె కూడా స్వాతంత్ర్య సంగ్రామంలోనూ చురుగ్గా పాల్గొన్నారు. ఇండియన్ నేషనల్ కాంగ్రెస్‌కు 1925లో అధ్యక్షురాలిగా వ్యవహరించారు. అంతేకాక యునైటెడ్ ప్రావిన్సెస్‌కు గవర్నర్‌గా వ్యవహరించారు. ఆమె రచనలో దేశభక్తి, బాలల గురించే కాక శృంగారం, ట్రాజెడీ తదితర భిన్న అంశాల ప్రస్తావన ఉండేవి. 1949 మార్చి 2న కన్నుమూశారు.

### ఫైజ్ అహ్మద్ ఫైజ్ (జయంతి)



ఫైజ్ అహ్మద్ ఫైజ్ 1911 ఫిబ్రవరి 13న పంజాబ్ రాష్ట్రం నరోవల్ (ప్రస్తుతం పాకిస్థాన్)లో జన్మించారు. ఉర్దూ, పంజాబీల భాషలలో రచయిత, కవిగా రాణించారు. 'ఏ మ్యాన్ ఆఫ్ వైడ్ ఎక్స్‌పీరియన్స్'గా, 'గ్రేటెస్ట్ పోయెట్'గా అభివర్ణించబడ్డారు. ఉపాధ్యాయుడు, ఆర్మీ అధికారి, పాత్రికేయుడు, ట్రేడ్ యూనియనిస్ట్, బ్రాడ్‌కాస్టర్‌గా ఇలా విభిన్నరంగాలలో రాణించారు. 'లెనిన్ పీస్ ప్రైజ్' అందుకున్న తొలి ఏషియన్. ఆయన రచనలు ఆంగ్లం, రష్యన్ తదితర భాషలలోకి అనువాదమయ్యాయి. సాహిత్యంలో నోబెల్ ప్రైజ్‌కు నామినేట్ అయ్యారు. 1984 నవంబరు 20న కన్నుమూశారు.

# సెమీ కండక్టర్ల రంగంలో రూ.10వేల కోట్ల పెట్టుబడులు

**» ఇన్వెస్ట్ కర్ణాటకలో ల్యాంబ్ రీసెర్చ్ సంస్థ ఒప్పందం**

బెంగళూరు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ప్రపంచ పెట్టుబడిదారుల సదస్సు (జిమ్)లో భాగంగా ఇన్వెస్ట్ కర్ణాటకలో భారీగా ఒప్పందాలు కొనసాగుతున్నాయి. అమెరికాకు చెందిన ల్యాంబ్ రీసెర్చ్ సంస్థ సెమీ కండక్టర్ రంగంలో 10వేల కోట్ల పెట్టుబడులకు ముందుకొచ్చినట్టు భారీ పరిశ్రమల శాఖ మంత్రి ఎంబీ పాటిల్ తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ల్యాంబ్ రీసెర్చ్ కంపెనీ గ్లోబల్ సీనియర్ వైస్‌చైర్మన్ శేషవరదరాజన్‌తో ఈ మేరకు ఒప్పందం చేసుకున్నట్టు ప్రకటించారు. రాష్ట్రంలో 8వేల కోట్ల పెట్టుబడులకు విప్రో జిఇ హెల్త్‌కేర్ ప్రకటించింది. రానున్న ఐదేళ్లలో బెంగళూరులోని వైట్‌ఫీల్డ్‌లో 30విధాలా ఔషధాలను తయారు చేసే పరిశ్రమలకు అనుబంధంగా పరిశోధనా కేంద్రాన్ని విస్తృతం చేస్తామని ప్రకటించారు. రెండు దశాబ్దాలలో 32వేల కోట్ల రూపాయల పెట్టుబడికి కారణం కానుందని కంపెనీ దక్షిణ ఏసియా విభాగం చీఫ్ చైతన్య సరవటి ప్రకటించారు. ప్రస్తుతం 4కేంద్రాలు ఉన్నాయని, వాటిని ఆధునీకరించి విస్తృతం చేస్తామన్నారు. ఇక ఎకస కంపెనీ సీఈఓ అరవింద్ మెల్లిగేరి స్పందిస్తూ బెళగావిలో దేశీయ వైమానిక విభాగానికి సంబంధించిన కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. 70శాతం విడిభాగాలను రూపొందించే సంస్థగా ప్రకటించారు. సుజ్లాన్ కంపెనీ 3వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పాదన కేంద్రానికి ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. విజయపుర జిల్లాల్లో ప్లాంట్ ఏర్పాటు చేయనున్నట్టు ప్రకటించారు. పప్పు గింజల సంస్కరణ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు వింగ్స్ వితారా సంస్థ రూ.250కోట్ల పెట్టుబడులకు అంగీకరించినట్టు మంత్రి ఎంబీ పాటిల్ తెలిపారు.



కర్ణాటక పెవిలియన్‌లో డీసీఎం డీకే శివకుమార్‌తో మంత్రి ఎంబీ పాటిల్ తదితరులు

**బెంగళూరు ట్రాఫిక్ ప్లస్ పాయింట్ : పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్రా**

సోషల్‌మీడియాలో నిరంతరం క్రియాశీలకంగా ఉండే మహీంద్రా అండ్ మహీంద్రా సంస్థ చైర్మన్ ఆనంద్ మహీంద్రా బెంగళూరు ట్రాఫిక్‌పై ఒక వాక్యంలో 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. పెట్టుబడిదారుల సదస్సులో పాల్గొనేందుకు వచ్చిన ఆనంద్ మహీంద్రా కన్నడలోనే మాట్లాడారు. కొడగులో తన బాల్య జ్ఞాపకాలను గుర్తు చేశారు. నగరం నుంచి వాపసు వెళ్తున్న వేళ ఎక్స్ ద్వారా గుడ్‌బై బెంగళూరు, నా మహీంద్రా బిఇ-6 వాహనం వేగానికి ధన్యవాదాలు. ఎక్కువగా ట్రాఫిక్ సమస్య ఉన్నందున వాహనాల షోరూంలో గడిపినట్టుగా ఉందన్నారు.

**సీఎం, డీసీఎంతో ప్రముఖుల భేటీ**

జిమ్‌కు హాజరైన ఇజ్రాయెల్ కాన్సుల్ జనరల్ ఒర్లివిట్స్‌మన్, డీసీఎం డీకే శివకుమార్‌ను కలిశారు. జపాన్ దేశ రాజకీయ వ్యవహారాలశాఖ మంత్రి అబెనూరియాకి డీసీఎంతో చర్చలు జరిపారు. జపాన్‌దేశ భారత రాయబారి కిచిఓను సీఎం సిద్దరామయ్యను అధికారిక నివాసం కావేరిలో భేటీ అయ్యారు.



సీఎంతో జపాన్ రాయబారి చర్చలు





డీసీఎంతో ఇజ్రాయెల్ కాన్సుల్ జనరల్

# గ్రానైట్ పరిశ్రమలో రూ.లక్ష కోట్ల లక్ష్యం

**» రాజస్థాన్ మంత్రి కృష్ణకుమార్ విష్ణోయ్**

బెంగళూరు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): దేశీయ గ్రానైట్ పరిశ్రమ లక్ష కోట్ల వ్యాపార లావాదేవీల లక్ష్యం పెట్టుకున్నామని మేక్ ఇన్ ఇండియాను ప్రోత్సహించాలని రాజస్థాన్ పరిశ్రమలశాఖ మంత్రి కృష్ణకుమార్ విష్ణోయ్ అభిప్రాయపడ్డారు. తుమకూరు రోడ్డులోని బెంగళూరు ఇంటర్నేషనల్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో స్టోనా ప్రదర్శనలను బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. సంప్రదాయక చేతివృత్తుల వేదిక ద్వారా ప్రారంభమైన గ్రానైట్ పరిశ్రమ ప్రస్తుతం విలాసవంతమైన నివాసాలు, భవనాలన్నింటికీ దేశీయగ్రానైట్ అవసరమైనంత ఉత్పత్తి చేస్తోందన్నారు. నాలుగు రోజుల ప్రదర్శనలకు దేశ విదేశీ కంపెనీలు అత్యాధునిక గ్రానైట్ యంత్రాల పరిశ్రమలు భాగస్వామ్యం అయ్యాయి. గ్రానైట్ ఫెడరేషన్ అధ్యక్షుడు కృష్ణప్రసాద్, ప్రధానకార్యదర్శి మనోజ్‌కుమార్‌సింగ్, స్టోనా 2025 అధ్యక్షులు మదన్‌లాల్‌జంగిల్, కేశవమూర్తి, కో-ప్రెసిడెంట్, హిమాన్షు సెహగల్‌లు పాల్గొన్నారు.





స్టోనా ప్రదర్శనలో రాజస్థాన్‌మంత్రి కృష్ణకుమార్ విష్ణోయ్ తదితరులు

## ఐదు దేశాల రక్షణమంత్రులతో... రాజ్‌నాథ్‌సింగ్ చర్చలు

బెంగళూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఏరో ఇండియా ప్రదర్శనలో భాగంగా మూడోరోజు బుధవారం ఐదుదేశాల రక్షణమంత్రులు, 40 కంపెనీల సీఈఓలతో రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ చర్చలు జరిపారు. జింబాబ్వే రక్షణమంత్రి ఒప్పాముచుంగిరి కాసిరి, యెమెన్ రక్షణమంత్రి లెఫ్టినెంట్ జనరల్ మొహసన్ మొహ్మద్ హుసేన్‌అల్‌డేరి, ఇథియోపియా రక్షణ మంత్రి ఆయేషా మహ్మద్, గ్యాంబియా రక్షణమంత్రి సేరింగ్ మాడౌజి, గ్యాబోన్ జాతీయ రక్షణమంత్రి బ్రిగిప్టి ఒంకనోవాతో చర్చలు జరిపారు. జింబాబ్వేమంత్రితో చర్చల వేళ సాయుధబలగాల శిక్షణలు, మిలిటరీ కోర్సులు, రక్షణారంగ సామర్థ్య ప్రగతి విషయంలో పరస్పర సహకారానికి ఒప్పందాలు చేసుకున్నారు. ఐదుదేశాల ప్రతినిధులతోనూ చర్చలు సానుకూలంగా జరిగాయన్నారు. మంగళవారందాకా 116 కంపెనీల అంతర్జాతీయ సీఈఓలతో పెట్టుబడులు, అభివృద్ధి కేంద్రాల స్థాపన వంటి అంశాలపై ఒప్పందాలు జరిగినట్టు తెలిపారు.

## ఘనంగా వేంకటేశ్వరస్వామి రథోత్సవం

శిడ్లఘట్ట, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన తలకాయలబెట్టపై కొలువైన వేంకటేశ్వరస్వామి రథోత్సవం మాఘపౌర్ణమిని పురస్కరించుకుని ఘనంగా జరిగింది. ఇటీవల కొండపైకి చేరేందుకు ప్రముఖ సమాజసేవకుడు పుట్టు ఆంజనప్ప ఆధ్వర్యంలో రోడ్డును నిర్మించారు. ఉత్సవాల సందర్భంగా డాంబరీకరణ, నీరు, పార్కింగ్ సదుపాయం కల్పించారు. ఉత్సవాలకు తహసీల్దార్ స్వామి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు వందలాదిమంది భక్తులు తరలి వచ్చారు. భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదాసోహం నిర్వహించారు.

## జేఈఈ మెయిన్స్‌లో ఆకాష్ విద్యార్థుల సత్తా

బెంగళూరు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్ ఫలితాలలో ఆకాష్ సంస్థకు చెందిన ఐదుగురు విద్యార్థులకు ఉత్తమ పర్సంటైల్ వచ్చినట్టు అకడమిక్ హెడ్ ధీరజ్‌కుమార్ మిశ్రా ప్రకటించారు. నగరంలో బుధవారం ఈమేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఆకాష్ దీప్ 99.99శాతం, అనిల్ శాస్త్రి 99.96శాతం, ఆర్యమాన్‌మిశ్రా 99.8, చిరాగ్ 99.72, ఆదిత్యసింగ్ 99.70 మార్కులు వచ్చినట్టు ప్రకటించారు.

## గ్రామ పాలనాధికారుల నిరసన



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

బంగారపేట, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): వివిధ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ గ్రామ పాలనాధికారులు చేపట్టిన నిరవధిక నిరసన మూడో రోజుకు చేరుకుంది. పట్టణంలోని తాలూకా కార్యాలయం వద్ద నల్లబ్యాడ్జీలతో ధర్నా చేశారు. బుధవారం ఎమ్మెల్యే నారాయణస్వామికి వినతిపత్రం సమర్పించారు. నిరసన కారణంగా రెవెన్యూ సేవలైన కుల, ఆదాయ ధ్రువీకరణ, జనన ధ్రువీకరణ ఇతర సేవలు లభించక సామాన్యులు, రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వీడాలని ఆందోళనకారులకు పిలుపునిచ్చారు. అయితే తమ డిమాండ్లు పరిష్కారమయ్యేంతవరకు వీడేది లేదని సంఘం సభ్యులు పేర్కొన్నారు. నిరసనలో సంఘం అధ్యక్షుడు సురేశ్, ఉపాధ్యక్షుడు అమరేశ్, శ్వేత, రమేశ్, అవినాశ్, మధుచంద్ర, సుజాత, అంజలి, చేతన్‌కుమార్, రవి, యోగేశ్ తదితరులు పాల్గొన్నారు.

## దళిత గృహ ప్రవేశానికి దశాబ్దం

**» 15న కోలారులో ప్రత్యేక కార్యక్రమం**





సమావేశంలో పాల్గొన్న వివేకానంద, అనంతనాయక్ తదితరులు

బెంగళూరు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): కోలారు జిల్లా ముళబాగిలు తాలూకా గొల్లహళ్ళి పంచాయతీ హెబ్బణి గ్రామంలో అధ్యాపకుడు శివప్ప తలపెట్టిన దళిత గృహప్రవేశానికి దశాబ్దకాలమైంది. ఈనెల 15న కోలారులోని చన్నయ్యరంగమందిరలో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు శివప్ప తెలిపారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో వివిధ ప్రజాసంఘాల ప్రముఖులు వివేకానంద, అనంతనాయక్, విజయ్‌కుమార్, డాక్టర్ రుద్రేశ్ అదరంగి, పండిట్ మునివెంకటప్ప, అబ్బని శివప్పలతో కలసి మాట్లాడారు. పదేళ్ల క్రిందట తండ్రి చనిపోయినప్పుడు ఇంటిచెంతకు జానపద తత్వాలు పాడేందుకు వందమందిదాకా దళితులు వచ్చారన్నారు. వారు ఇంటి ఆవరణలోకి రాకపోవడంపై అనుమానం వచ్చి మాట్లాడానన్నారు. అదేరోజున వారందరినీ మా ఇంట్లోకి ఆహ్వానించానన్నారు. ఇలా తొలి దళిత గృహప్రవేశం మా ఇంట్లోనే జరిగిందన్నారు. ఇలా పదేళ్లుగా సామాజిక చైతన్యం తీసుకొచ్చేందుకు ప్రజాసంఘాల ప్రతినిధులతో కలసి ప్రతి ఆదివారం దళిత గృహప్రవేశం చేశామన్నారు. దళితుల ఇంటికి మేమే వెళ్లి ఒకరోజు గడిపేవారమన్నారు. ఆలయాల్లో ప్రవేశంపైనా అవగాహన కల్పించామన్నారు. సమాజంలో నేటికీ సామాజికరుగ్మతలు ఉన్నాయని, ఆధునిక యుగంలోనూ వాటిని సంప్రదాయంగా భావించేవారితో సంఘర్షణ లేకుండా సానుకూలంగా అవగాహన కల్పిస్తున్నామన్నారు. 'అరివు భారత' సంస్థ ద్వారా దళిత గృహప్రవేశం పదేళ్లు ముగిసిన మేరకు శనివారం కోలారులో ప్రత్యేక సభ ఏర్పాటు చేశామన్నారు. మంత్రులు సతీశ్‌జార్కిహొళి, హెచ్‌సీ మహదేవప్పలతోపాటు హైకోర్టు మాజీ జస్టిస్ నాగమోహన్‌దాస్, విద్యాశాఖ కమిషనర్ త్రిలోక్‌చంద్రతోపాటు పలువురు పాల్గొంటారన్నారు.

# గ్లోబల్ సమ్మిట్‌ల వేదిక బెంగళూరు

**» వేలాదిమంది విదేశీయులతో సందడి - వివిధ రాష్ట్రాల నుంచి లక్షమంది ప్రతినిధులు**



ఎయిర్ షోకు వెళ్లే మార్గం ఇలా...

బెంగళూరు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ ప్రముఖ సదస్సులు ఏదో ఒక విభాగానికి సంబంధించి ఒకదేశంలో కొనసాగుతాయి. అక్కడికి సంబంధిత పరిశ్రమలకు చెందిన పారిశ్రామికవేత్తలు, ఎగ్జిబిటర్స్, సందర్శకులు వెళ్తారు. అయితే దేశంలో ఎక్కడా లేనివిధంగా బెంగళూరులో ఒకేసారి నాలుగు అంతర్జాతీయ ప్రదర్శనలతోపాటు సదస్సులు కొనసాగుతున్నాయి. భాగస్వామ్యులయ్యేందుకు వివిధదేశాలకు చెందిన వేలాదిమంది ప్రతినిధులు నగరానికి చేరుకున్నారు. బెంగళూరులోని స్టార్ హోటల్స్‌తోపాటు సమీపప్రాంతాలలోని రిసార్టులు నిండిపోయాయి. ఇక వివిధ రాష్ట్రాలకు చెందిన దిగ్గజ కంపెనీలు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ తోపాటు సందర్శకులు లక్షమందికిపైగా తరలివచ్చారు. రవాణా, అద్దె వాహనాలు బెంగళూరులో బుక్ చేయడమే ఒక సవాల్‌గా మారింది. ఈనెల 10న ఏరో ఇండియా వైమానిక ప్రదర్శనలు ప్రారంభమయ్యాయి. ఆసియాఖండంలోనే అతిపెద్ద వైమానిక, రక్షణారంగ ప్రదర్శనల వేదికగా ఉంది. మంగళవారం గ్లోబల్ ఇన్వెస్టర్స్ మీట్ (ప్రపంచపెట్టుబడిదారుల సదస్సు) ఇన్వెస్ట్ కర్ణాటక 2025 లాంఛనంగా శ్రీకారం చుట్టారు. బుధవారం నుంచి ప్రదర్శనలు, సాంకేతిక సదస్సులు, ఒప్పందాలు సాగుతున్నాయి. సుమారు 30దేశాలనుంచి కంపెనీల సీఈఓలు, వివిధ దేశాల రాయబారులు తరలి వచ్చారు. దేశీయ కంపెనీలు వందల సంఖ్యలో భాగ స్వామ్యులయ్యారు. తొలి రోజున బుధవారం ప్యాలెస్ మైదానంలో జరుగుతున్న ఇన్వెస్ట్ కర్ణాటకను 10వేల మందికిపైగా సందర్శించి ఉంటారని అంచనా వేస్తున్నారు. మరోవైపు ఫెడరేషన్ ఆఫ్ ఇండియా గ్రానైట్ అండ్ స్టోనా ఇండస్ట్రీ 'యువర్ నావిగేటర్ టు ది వరల్డ్ ఆఫ్ స్టోన్ ట్రేడ్' పేరిట సదస్సును బెంగళూరు ఇంటర్నేషనల్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ప్రారంభమైంది. ఇక గురువారం ట్రావెల్ టూరిజం ఫెయిర్ (టీటీఎఫ్) సదస్సు త్రిపురవాసిని ప్యాలెస్‌మైదానంలో ప్రారంభమవుతోంది. ఇలా నాలుగు ప్రముఖ సదస్సులు, ప్రదర్శనలు కొనసాగుతుండడంతో నగరం జనసందడిగా మారిపోయింది. సాధారణంగానే నగరంలో ప్రయాణం అంటే గంటలతరబడి ట్రాఫిక్‌లో ఉండాల్సి ఉంటుంది. ఒకేసారి నాలుగు ప్రదర్శనలతో లక్షలాదిమంది ప్రముఖులు నగరానికి రావడంతో వారి భద్రత, రవాణా, వసతి సౌలభ్యం సవాల్‌గా మారింది.



గ్లోబల్ ఇన్వెస్ట్ కర్ణాటక సదస్సు నిర్వహిస్తున్న ప్యాలెస్ మైదానం

హెబ్బాళ బ్రిడ్జ్ నుంచి సుమారు పది కిలోమీటర్ల దూరంలో ఉండే యలహంక ఎయిర్‌బేస్‌కు చేరుకునేందుకు తెల్లవారున 6 గంటలనుంచి రాత్రిపొద్దుపోయేదాకా కనీసం 2-3గంటల సమయం కేటాయించాల్సి వస్తోంది. ఇన్వెస్ట్ కర్ణాటక సదస్సు బెంగళూరు ప్యాలెస్‌లో కొనసాగుతుండడంతో విధానసౌధ, కంటోన్మెంట్, వసంత నగర్, బళ్ళారి రోడ్డు మార్గాలలో తీవ్ర ట్రాఫిక్ ప్రభావం చూపుతోంది.

## సిత్రాలు సూడరో!

### నింగిలో లోహవిహంగాల విన్యాసాలు

బెంగళూరు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): నగరంలో జరుగుతున్న ఎయిర్ షో ప్రదర్శన మూడోరోజు కూడా పలు రకాల విమానాల ప్రదర్శనలు సందర్శకులను అలరించాయి. ఎఫ్16 ఎయిర్‌క్రాఫ్ట్, హెచ్‌టిటి 40 ఎయిర్ క్రాఫ్ట్, ఐజెటి ట్రైనర్ ఎయిర్‌క్రాఫ్ట్, ఎల్‌సిఎ ఎంకె1ఎ ఎయిర్‌క్రాఫ్ట్, ఎల్‌యుహెచ్ ఎయిర్‌క్రాఫ్ట్, ఎస్‌యు30 ఎయిర్‌క్రాఫ్ట్, ఎస్‌యు 57 ఎయిర్‌క్రాఫ్ట్‌ల ప్రదర్శనలు సాగాయి. ప్రత్యేకించి సూర్యకిరణ్ విమానాలు త్రివర్ణంలో ఆకట్టు కున్నాయి. ఎయిర్‌బేస్ అంతా తామే అనేలా సందడి చేసి అలరించాయి. లవ్‌షేప్, ఇతర ఆకారాల పొగలతో వినూత్న అనుభూతికి లోను చేశాయి. ఎండ ఉన్నప్పటికీ లెక్కచేయకుండా సందర్శకులు టోపీలు, గొడుగులతో విన్యాసాలు వీక్షించారు. ఫోటోలు, సెల్ఫీలు తీసుకున్నారు. యలహంక ఎయిర్‌బేస్ చుట్టుపక్కల ప్రాంతాలు సందర్శకులతో సందడిగా నిలిచాయి. ఎయిర్‌బేస్ సమీపంలోని ఇళ్లు, భవనాలపైనా నిలబడి విమానాల విన్యాసాలను వీక్షించారు. కాగా మరో రెండురోజులపాటు సాధారణ ప్రజలకు కూడా ప్రదర్శనకు అవకాశం కల్పించడంతో మరింత సందడి నెలకొనే అవకాశం ఉంది.



ఎస్‌యూ 30 ఎయిర్‌క్రాఫ్ట్



ఎఫ్16..





హెచ్‌టీటీ 40 ఎయిర్ క్రాఫ్ట్





ఎల్‌యూహెచ్ ఎయిర్ క్రాఫ్ట్




సూర్యకిరణ్ విమానాల విన్యాసాలు





యలహంక ఎయిర్‌బేస్‌లో విమానాల విన్యాసం....



## తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

| | ప్రస్తుతం | గత ఏడాది |
|---|---|---|
| నీటి మట్టం (అడుగులు) | 1614.42 | 1,588.04 |
| ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు) | 0 | 0 |
| ఔట్ ఫ్లో (క్యూసెక్కులు) | 7,232 | 87 |
| నీటి నిల్వ (టీఎంసీలు) | 47.06 | 9.47 |

## నావల్ బేస్‌లో సైనికుడి ఆత్మహత్య

ప్యారీస్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్రం అరక్కోణంలోని భారత నావికాదళం మైదానంలో ఓ సైనికుడు తుపాకీతో కాల్చుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అరక్కోణంలోని శిక్షణా కేంద్రంలో పలు రాష్ట్రాలకు చెందిన సైనికులు శిక్షణ పొందుతుంటారు. ఈ కేంద్రంలో శిక్షణ పొందుతున్న కర్ణాటక రాష్ట్రానికి చెందిన ప్రవీణ్‌కుమార్ తన గదిలో తుపాకితో కాల్చుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

## యోగాతో ఒత్తిడికి చెక్



యోగాసనాలు వేస్తున్న జనం

కంప్లి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ ఉదయం, సాయంత్రం గంట సమయాన్ని యోగాకు కేటాయిస్తే వారి ఆరోగ్యం సురక్షితంగా ఉంటుందని పతంజలి యోగా సమితి జిల్లా సంచాలకులు డాక్టర్ అంద్రాల్ తెలిపారు. మంగళవారం హోస్పేటలోని ఫ్రీడమ్ పార్కులో యోగా పతంజలి ఆధ్వర్యంలో పలువురికి శిక్షణ కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యోగాతో సంపూర్ణ ఆరోగ్యంతో పాటు ఒత్తిడి దూరం చేసుకోవచ్చన్నారు. పిల్లలు, పెద్దలు తేడాలేకుండా యోగా చేయాలన్నారు.

## కొనసాగుతున్న అకౌంటెంట్ల నిరసన

సిరుగుప్ప, ఫిబ్రవరి 12(ఆంధ్ర జ్యోతి): తమ సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాటం ఆపే ప్రసక్తే లేదని విలేజ్ అకౌంటెంట్ల సంఘం జిల్లా అధ్యక్షుడు రామప్ప ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం సిరుగుప్ప పట్టణం తహసీల్దార్ కార్యాలయం ఎదుట విలేజ్ అకౌంటెంట్లు చేపట్టిన ధర్నా మూడవ రోజుకు చేరుకుంది. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం సమస్యల పరిష్కారాన్ని పట్టించుకోక పోవడం విడ్డూరమన్నారు. తమ డిమాండ్లు ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలన్నారు.



ధర్నా చేస్తున్న విలేజ్ అకౌంటెంట్లు

## బాలల హక్కుల పై అవగాహన

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని మోకా గ్రామంలోని కర్ణాటక పబ్లిక్ పాఠశాల పిల్లలకు బాలల హక్కుల రక్షణ ,చట్టాలపై అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈకార్యక్రమాన్ని మోకా ఎస్ఐ కళింగ ప్రారంభించి మాట్లాడారు. ప్రధానోపాధ్యాయురాలు భారతి, నవదుర్గి బృందం అధ్యక్షుడు మహేశ్ గౌడ పాల్గొన్నారు.

# శంభో శంకర..!



రథోత్సవంలో ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి, మేయర్ నందీశ్ తదితరులు

బళ్లారి గాంధీనగర్/ సిటీ, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి):బళ్లారి నగర ఆరాధ్యదైవమైన కోట మల్లేశ్వర స్వామి రథోత్సవం బుధవారం సాయంత్రం అంగరంగ వైభవంగా సాగింది. అశేష భక్త జనం బ్రహ్మరథోత్సవంలో పాల్గొని జోడు అరటిపళ్ళు రథంపైకి విసురుతూ మల్లేశ్వర స్వామికి మొక్కులు తీర్చుకున్నారు. రథోత్సవం తిలకించడానికి బళ్ళారి నగరంతో పాటు చుట్టుప్రక్కల గ్రామాల నుండి పెద్ద ఎత్తున భక్తులు తరలి రావడంతో తేరు వీధి అంతా ప్రజలు, భక్తులతో నిండి పోయింది. రథోత్సవాన్ని అర్చకులు నిర్ణయించిన గడియల్లోనే ప్రారంభించారు. తేరువీధిలో ఉన్న రథం అశేష భక్త జనం నడుమ కొలిమి చౌక్ వరకు కొనసాగింది. బ్రహ్మ రథోత్సవం ప్రారంభం నుంచి సిటీ ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి పాల్గొని ముగిసే వరకు భక్తుల నడుమ తాను ఓ సామాన్య భక్తుడిగా ఆద్యాంతం రథోత్సవంలో పాల్గొన్నారు. ఈ నెల 6 వ తేదీ నుండే రథోత్సవానికి ఏర్పాట్లు ప్రారంభం కాగా...రథోత్సవం పర్వం ముగిసింది. అయితే రథోత్సవం అనంతరం ఈ నెల 26వ తేదీ శివరాత్రి వరకు ఉత్సవాలు జరగనున్నాయి. నగరంలోని కోట ప్రాంతంలో వెలసిన కోట మల్లేశ్వర స్వామి దేవస్థానం ఉత్సవాలకు ముస్తాబయింది. రంగు రంగుల విద్యుత్ దీపాలతో దేవాలయాన్ని అలంకరించారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టినట్లు ఎగ్జిక్యూటివ్ అధికారి హనుమంతప్ప తెలిపారు.



భక్తులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న వాసవి ట్రస్ట్ సభ్యులు

### భక్తులకు మజ్జిగ పంపిణీ

కోటమల్లేశ్వరస్వామి రథోత్సవం సందర్భంగా వాసవీ క్లబ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. పంపిణీ కార్యక్రమం వాసవీ క్లబ్ అధ్యక్షుడు తిప్పయ్య ఆధ్వర్యంలో చేపట్టారు. భక్తుల దాహం తీర్చడానికి మజ్జిగ పంపిణీ చేపట్టామన్నారు. క్లబ్ ఉపాధ్యక్షురాలు జయంతి కిషోర్ కుమార్, కార్యదర్శి శ్రీనివాసులు, కోశాధికారి గోవింద రాజులు, సంఘం మాజీ అధ్యక్షుడు శేఖర్,ఆర్యవైశ్య సంఘం నాయకులు గాదెం గోపాలకృష్ణ, సొంతగిరిధర్, నామా నాగరాజు, వనిత క్లబ్ అధ్యక్షురాలు పల్లవిశేఖర్, కార్యదర్శి అశ్విని, స్వాతి పాల్గొన్నారు.

### రథోత్సవంలో మాజీ ఎంపీ సన్న పక్కీరప్ప

బళ్లారిరూరల్ : నగర అరాధ్యదైవం కోట మల్లేశ్వరస్వామి రథోత్సవంలో రాయచూరు మాజీ ఎంపీ సన్నపక్కీరప్ప, మహానగరం సభ్యులు గోవింద రాజులు, కుప్పే స్వామి, సుజిత్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## ఉత్సవాలను వైభవంగా నిర్వహిద్దాం

● హంపిలో వేదిక ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్



ప్రధాన వేదిక స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఎంఎస్ దివాకర్

కంప్లి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): విశ్వవిఖ్యాత హంపి ఉత్సవాలను ఈనెల 28, మార్చి 1, 2 మూడు రోజుల పాటు జరిపే హంపి ఉత్సవాలను వైభవంగా జరుపుకుందామని విజయనగర జిల్లా అధికారి ఎంఎస్ దివాకర్ తెలిపారు. బుధవారం హంపి ఉత్సవాల సందర్భంగా ప్రధాన గాయత్రి వేదికను ఆయన పరిశీలించారు. మాజీ ఉప ముఖ్యమంత్రి ఎంపీ ప్రకాష్ పేరుతో ఎంపీ ప్రకాష్ వేదికగా పిలువబడుతుందన్నారు. ప్రధాన వేదిక 120-80 అడుగులలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఐదు వేదుకలతో పాటు ఎదురుబసవన్న వేదిక, విరుపాక్షేశ్వరస్వామి వేదిక, శాశ్వేకాళ్ గణప్ప వేదిక, ధ్వని బెళకు కూడా ఈ యేడాది పూర్తిగా ఆకట్టుకుంటుందని తెలిపారు. పార్కింగ్ సుమారు వంద ఎకరాలకు పైగా ఏర్పాటు చేశామన్నారు. గతంలో హంపి ఉత్సవాల్లో మాదిరిగి కవి గోష్టి, మహిళా గోష్టి, బైస్కై, ఇతర పోటీలు కూడా యథావిధిగా జరుగుతాయన్నారు. ఏడు రోజుల పాటు ధ్వనిబెళకు కార్యక్రమం వుంటుందన్నారు. ఉత్సవాలకు ఒక రోజు ముందే తుంగహారతి, వీరభద్రేశ్వర ఆలయం నుంచి విరుపాక్షేశ్వర స్వామి ఆలయం వరకు ఊరేగింపు జరుపబడుతుందన్నారు. అలాగే విజయవిఠల దేవస్థానం ప్రాంగణంలో రెండురోజుల ముందుగానే యోగా అభ్యాసం నిర్వహిస్తామన్నారు. ఈసారి రూ.4 లక్షల మందికిపైగా పాల్గొనేలా ప్రచార కార్యక్రమాలు కూడా చేపడుతున్నామన్నారు. 250 బస్సులు ఉచితంగా బస్సులను ఉత్సవాలకు పాల్గొనేలా ఏర్పాటు చేశామన్నారు. హోస్పేట నుంచి 40 బస్సులు వున్నాయన్నారు. ఈ ఉత్సవాలకు రూ. 20 కోట్లు నిధులు ప్రభుత్వం మంజూరు చేసినట్లు తెలిపారు. ప్రారంభానికి ముఖ్యమంత్రి సిద్దరామయ్య, వక్ఫ్‌బోర్డు జిల్లా మంత్రులు జమీర్ అహ్మద్, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొంటున్నట్లు తెలిపారు. గత యేడాది కళాకారులు అందించిన ప్రోత్సాహక ధనం ఈ యేడాది మార్చిలోగా తమ ఖాతాలో జమ అవుతాయని తెలిపారు. ఈ హంపి ఉత్సవాలను వైభవంగా జరిపేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. వారితో పాటు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## వైభవంగా పంపావతి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న మహిళలు

కంప్లి, ఫిబ్రవరి 12 (ఆంధ్ర జ్యోతి): పట్టణంలోని కోట పంపాపతి రథోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. ఉదయం పంపాపతి, పార్వతికి ప్రత్యేక పూజలు చేపట్టారు. అమృతాభిషేకం, బిల్వార్చన, తదితర పూజలు చేపట్టారు. అలాగే ఎమ్మిగనూరు గ్రామంలో బసవన తాత రథోత్సవం భక్తాదుల మధ్య కన్నుల పండువగా నిర్వహించుకున్నారు.

## గాంధమ్మదేవి మహా రథోత్సవం

సిరుగుప్ప, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలో గాంధమ్మదేవి మహారథోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. దేశనూరు రోడ్డు మార్గంలో వెలసిన గాంధమ్మదేవికి భక్తులు భక్తి శ్రద్ధలతో మొక్కులు తీర్చుకున్నారు. మేళతాళాలతో, డోలు డమరులతో యువకుల నృత్యాలు రథోత్సవంను లాగారు. భక్తులు రథంపైకి పూలు, పండ్లు విసిరి మొక్కులు తీర్చుకన్నారు. ఈ రథోత్సవానికి వేలాది మంది భక్తాదులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

రథోత్సవంలో పాల్గొన్న భక్తులు





కార్యక్రమంలో మాట్లాడుతున్న సెషన్స్ కోర్టు న్యాయాధికారి కేజీ శాంతి

## అందరి సహకారంతోనే వెట్టిచాకిరీ నిర్మూలన

● జిల్లా సెషన్స్ కోర్టు న్యాయాధికారి కేజీ శాంతి

బళ్లారి గాంధీనగర్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఆధునిక యుగంలోనూ సమాజాన్ని పట్టిపీడిస్తున్న వెట్టిచాకిరి పద్దతి నిర్మూలనకు అందరి సహకారం అవసరమని, వెట్టిచాకిరి పద్దతిని కూకటి వేళ్ళతో తొలగించి వేయాలని జిల్లా సెషన్స్ కోర్టు న్యాయాధికారి, జిల్లా న్యాయసేవ ప్రాధికార అధ్యక్షులు కె.జి.శాంతి పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా పాలనా మండలి, జిల్లా పంచాయతీ, కార్మిక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వెట్టిచాకిరి నిర్మూలనా కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆర్థిక స్థితి దుర్భరమైన సందర్భంలో వెట్టి చాకిరి పద్దతి ఉద్భవిస్తుందని, పూర్వ కాలంలో ఎక్కువగా అగ్రవర్ణాల కుటుబాల్లో ఈ వ్యవస్థ ఉండేదన్నారు. 14 సంవత్సరాల లోపు పిల్లల చేత పనులు చేయడం చట్టపరంగా విరుద్దమని, పిల్లలకు విద్యను అందజేయాలని, విద్యాభివృద్ధి చెందినపుడే వెట్టి చాకిరి పద్దతి సంపూర్ణంగా నిర్మూలన సాధ్యమన్నారు. రాజ్యాంగం ప్రతి ఒక్కరికీ గౌరవంగా బతికే హక్కు ఇచ్చిందని, ప్రభుత్వం విద్యతో పాటు పలు సౌలభ్యాలు కల్పించిందని, వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. వెట్టి చాకిరి పద్దతి నిర్మూలన కోసమే వివిధ శాఖల సంయుక్తంగా టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసిందన్నారు. విద్యార్థులు చట్టాలపై అవగాహక కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర పిల్లల హక్కుల సంరక్షణ కమిషన్ మాజీ సభ్యులు హెచ్.సి.రాఘవేంద్ర వెట్టి చాకిరి కార్మిక నిర్మూలన గురించి వివరించారు. ఈ సందర్భంగా జిల్లా చట్టసేవ ప్రాధికరసభ్యులు, సీనివిల్ న్యాయమూర్తి రాజేష్ ఎన్.హొసమనె, జిల్లా సహాయాధికారి మహ్మద్ జుబేరా, అడిషనల్ ఎస్పీ నవీన్ కుమార్, జిల్లా కాల కార్మిక యోజనాధికారి ఎ. మౌనేష్, కార్మిక శాఖ అధికారిస ఇద్దప్ప, ఖైనూరులతోపాటు జిల్లా, తాలూకా స్థాయి వివిధ అధికారులు, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## పోషకాహారంతో రక్తహీనత నివారణ

● జిల్లా పంచాయతీ సీఈఓ రాహుల్ శరణప్ప



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న జడ్పీ సీఈఓ రాహుల్ శరణప్ప

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): గర్భిణులు, పిల్లలు పోషకాహారం తీసుకుంటే రక్తహీనత నివారించవచ్చని జిల్లాపంచాయతీ సీఈఓ రాహుల్ శరణప్ప తెలిపారు. జిల్లాయంత్రాంగం, ఇండియన్ పీడియాట్రిషియన్స్ అసోసియేషన్ , జిల్లాఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖల సహకారంతో పిల్లల్లో పోషకాహార లోపాన్ని గుర్తించడానికి 5నుంచి 10 తరగతుల పిల్లలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించడానికి జిల్లా కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన పింక్ వాన్ జాతా కార్యక్రమాన్ని ఆయన జెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. రక్తహీనత కారణంగా పిల్లల్లో ఎదుగుదల నిలిచిపోతుందన్నారు. కర్ణాటక వైద్య మండలి అధ్యక్షుడు డాక్టర్ యోగానంద్‌రెడ్డి మాట్లాడుతూ పింక్ వ్యాన్ ప్రధాన లక్ష్యం కౌమారదశలో ఉన్నవారిలో ఆరోగ్యపరీక్షలు నిర్వహించడం, భారతదేశాన్ని రక్తహీనత లేని దేశంగా మార్చడమేనన్నారు. పిల్లలు కౌమార దశలో ఉన్నవారు మహిళల్లో రక్తహీనత ఎక్కువగా కనిపిస్తుందని కలెక్టర్ ప్రశాంత్ కుమార్ అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రక్తహీనత గురించి మరిన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన ఆరోగ్య అధికారులకు సూచించారు. జిల్లా సర్జన్ డాక్టర్ బసారెడ్డి, జిల్లా ఆర్‌సీహెచ్ అధికారి డాక్టర్ హనుమంతప్ప, డాక్టర్ కృష్ణ,డాక్టర్ బసవరాజ్, డాక్టర్ విశ్వనాథ్, డాక్టర్ రవిశంకర్ డాక్టర్ దుర్గప్ప, డిడిపీఐ కొట్రేశ్, జిల్లాఆరోగ్య విద్య అధికారి ఈశ్వర్ దాసప్ప పాల్గొన్నారు.

### ఉద్యోగులకు ఆరోగ్య పరీక్షా శిబిరం

బళ్లారి సిటీ,ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): నగరంలోని అగ్నిమాపక శాఖ ఎదురుగా ముత్తూట్ ఫిన్‌కార్ప్ కార్యాలయంలో శ్రీ కోటే మల్లేశ్వర స్వామి జాతర సందర్భంగా ముత్తూట్ ఫిన్‌కార్ప్ వినియోగదారులకు, ప్రజలకు ఉచితంగా రక్తపరీక్ష, మధుమేహం, కన్ను, దంతాల పరీక్షలు నిర్వహించారు. శిబిరాన్ని ప్రారంభించి బ్రాంచ్ మేనేజర్ వేదవతి మాట్లాడారు. ముత్తూట్ ఫిన్‌కార్ప్ వ్యవస్థాపకుడు ప్రశాంత్, విరూపాక్షప్ప, కిశోర్‌కుమార్, శ్రీనివాస్, ప్రవీణ్‌కుమార్, శ్రీకాంత్, మంజునాథ్,సబీయా, హొన్నప్ప, దంతవైద్యుడు సురేశ్ పాల్గొన్నారు.

## జేఈఈ మెయిన్స్‌లో 'నంది' విద్యార్థుల ప్రతిభ


కౌస్తుబ్ చౌదరి


జితేంద్ర పాబ్బతి


హర్షద్ అలి


హర్షిత

బళ్లారి గాంధీనగర్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి ఐఐటీ, ఎన్ఐటీ ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశం కోసం నిర్వహించే జాతీయ స్థాయి జేఈఈ మెయిన్ పరీక్షల్లో బళ్లారి నగరానికి చెందిన నంది పీయూ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచినట్లు నంది గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూట్స్ కళాశాల ప్రిన్సిపాల్స్ పి.అనిత, మక్సూద్ భాషా సంయుక్తంగా ఒక ప్రకటనలో తెలిపారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థుల్లో కౌస్తుబ్ చౌదరి 99.2035 పర్సెంటైల్ సాధించి బళ్ళారి జిల్లా స్థాయిలో టాపర్‌గా నిలవగా, జితేంద్ర పబ్బతి 95.5 పర్సెంటైల్ సాధించినట్లు తెలిపారు. వీరితో పాటు హర్షద్ అలి 94.35, హర్షిత 91.41 పర్సెంటైల్ సాధించి జిల్లా స్థాయిలో కళాశాలకు ఉత్తమ పేరు తీసుకురావడం హర్షించదగ్గ విషయమన్నారు. ఈ సందర్భంగా నంది గ్రూప్ ఆఫ్ ఇనస్టిట్యూషన్స్ డైరెక్టర్ ఉమేర్ అహ్మద్, కళాశాల ప్రిన్సిపాల్ పి.అనిత కళాశాల అధ్యాపకులకు, విద్యార్థులను ప్రోత్సహించిన తల్లితండ్రులకు అభినందించారు.

## న్యూ శ్రీ చైతన్య కళాశాల విద్యార్థులు


వివేక్‌కుమార్


అంజలి


నిర్మల


కార్తీక్


నిఖిల్

బళ్లారి సిటీ : నగరానికి చెందిన న్యూ శ్రీ చైతన్య కళాశాల విద్యార్థులు జేఈఈ మెయిన్స్‌లో ఉత్తమ ప్రతిభ సాధించినట్లు కళాశాల పాలక మండలి అధ్యక్షుడు రాధాకృష్ణ తెలిపారు. వివేక్‌కుమార్ 96.40శాతం, అంజలి 92.50, నిర్మల 92.50, కార్తీక్ 91.40, నిఖిల్ 91.30, ఓంకారేశ్వరి 90.90, శివకృష్ణ 90.90, కాలింగ 90.40, రుద్రగౌడ 90.30, మోహమ్మద్ 90.18, హన్షికా 90.00శాతంతో ఫలితాలు సాధించారన్నారు. విద్యార్థులను అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.


ఓంకారేశ్వరి


శివకృష్ణ


కాలింగ


రుద్రగౌడ


మహమ్మద్


హన్షిక

# హోసూరు జోన్

## ఘనంగా తిమ్మరాయస్వామి రథోత్సవం



రథోత్సవానికి హాజరయిన భక్తులు

హోసూరు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): హోసూరు సమీపానగల గుడిసెట్లు గ్రామంలోని తిమ్మరాయ స్వామి ఆలయంలో శ్రీదేవి భూదేవి సమేత స్వామివారి రథోత్సవం వైభవంగా జరిగింది. గుడిసెట్లు ప్రాంతంలోని ఆలయానికి సుమారు 400 సంవత్సరాల చరిత్ర ఉందని గ్రామస్థుల ద్వారా తెలుస్తోంది. రథసప్తమి రోజున ఉత్సవాలకు ధ్వజారోహణతో శ్రీకారం చుట్టారు. అనంతరం ఒక్కోరోజు ఒక్కోరూపంలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. సూర్యప్రభ, చంద్రప్రభ, కల్పవిరుత్సం తదితర వాహనాల్లో స్వామి ఉత్సవమూర్తులు తీసుకుని ఊరేగించారు. ఉత్సవాల్లో ప్రధాన బ్రహ్మ రథోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. తొలుత పూర్ణకుంభ కలశాలతో వేద మంత్రోచ్ఛారణలు చేస్తూ ఉత్సవ మూర్తులు శ్రీ గణపతి, శ్రీదేవి, భూదేవి, వెంకటాచలపతి, ఆంజనేయ స్వామికు మేళతాళాల నడుమ ఉత్సవమూర్తులను ఊరేగించారు. సరిహద్దులోని ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాల భక్తులు పాల్గొన్నారు.

### మాసాని అమ్మవారికి విశేష పూజలు

హోసూరు సమత్వపురంలోని మాసాని అమ్మవారి ఆలయం ప్రసిద్ధి చెందింది. ఆ ఆలయంలో బుధవారం ఉత్సవాలు జరిగాయి. ధ్వజారోహణంతో ప్రారంభమై అనంతరం అమ్మవారికి వివిధ అభిషేకాలతో అమ్మవారిని పూజించారు. తర్వాత పుష్పాలంకరణాలతో అమ్మవారికి పూజలు చేశారు. మహిళలు పాల కళశాలతో అమ్మవారిని అభిషేకించారు. ఉపవాసాలతో అమ్మవారికి పాల కలశాలు తీసుకొచ్చారు. కొందరూ భక్తాదులు ఊరేగింపుగా పూల కరగం కూడా తీసుకొచ్చారు. రాత్రంతా అమ్మవారికి పూజలు జరుపుతుంటారు.



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న పండితులు

## బర్గూరు నియోజకవర్గంలో మంత్రి పర్యటన

హోసూరు(కృష్ణగిరి), ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి జిల్లా బర్గూరు పంచాయతీ యూనియన్ పరిధిలో కార్మికశాఖ, నైపుణ్యాభివృద్ధిశాఖ మంత్రి గణేశన్ పర్యటించారు. కుత్తూరు, పట్టపల్లి, సిగరలపల్లి, బెలవర్తి, జగదేవి మూడోదశ పథకాన్ని కలెక్టర్ ఎస్.దినేశ్‌కుమార్ పర్యవేక్షించారు. ప్రజల నుంచి మంత్రి వినతిపత్రాలను స్వీకరించారు. మంత్రి సివి. గణేశన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలోని తమిళనాడు ప్రభుత్వం పేదలు, బడుగు బలహీన వర్గాల ప్రజలందరికీ ప్రయోజనం చేకూర్చడానికి, ప్రజలు డిమాండ్లను పరిష్కరించేందుకు పలు కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. మహిళా హక్కుల పథకం ,మహిళలకు డోస్ ట్రావెల్ స్కీమ్, మెడికల్ స్కీమ్ కోరుకునే ప్రజలు, కరుణానిధి కలల గృహం వంటి మార్గదర్శక కార్యక్రమాలను చేస్తోందన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయడం ద్వారా వివిధ సేవలను విజయవంతంగా అమలు చేయడం సాధ్యమవుతోందన్నారు. ధర్మపురి జిల్లాలో గ్రామీణ ప్రాంతాల కోసం పీపుల్ విత్ సీఎం ప్రాజెక్టును 2024 జూలై 11న ప్రారంభించారన్నారు. పేద ప్రజలకు ప్రయోజనం చేకూర్చేందుకు, వైద్య బీమా పథకం క్రింద ఉన్నత ఆసుపత్రులలో గుండె, కిడ్నీ, బ్రెయిన్ ట్యూమర్, కీళ్ల నొప్పులు సహ వివిధ శస్త్రచికిత్సలు మరియు నాణ్యమైన చికిత్సలను ఉచితంగా పొందవచ్చునన్నారు. ప్రస్తుతం గిండిల్లోని కలయన్ సెంటెనరీ హాస్పిటల్ ప్రైవేట్ ఆసుపత్రులతో సమానంగా ఉన్నత స్థాయి ఆరోగ్యసేవలు అందిస్తోందన్నారు. ప్రజలందరూ వైద్య బీమా కార్డును పొదడం తప్పనిసరి అని తెలిపారు. బర్గూరు పంచాయతీ యూనియన్‌లో లబ్ధిదారులకు రైతు ధృవీకరణ పత్రాలు, పెన్షన్, విద్యా ఉపకార వేతనాలు, త్రిచక్రవాహనాలు, వ్యవసాయ ఉత్పత్తులు, స్వయం ఉపాధి రుణం ఇతర సంక్షేమ పథకాలు అందించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎ.సాధనకురళ్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రోగ్రామ్ డైరెక్టర్ కె.కవిత, కృష్ణగిరి దేవదాయ శాఖ కమీషనర్ ఎన్.షాజాహాన్, డిప్యూటి కలెక్టర్ (సామాజిక భద్రత పథకం) సి.పన్నీర్‌సెల్వం, అదనపు పోలీసు సూపరింటెండెంట్ ఇందిర, పశుసంవర్ధక శాఖ కమీషనర్ సంయుక్త సంచాలకులు ఇళంగోవన్, తదితర ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు వాహనాలు అందజేస్తున్న కార్మిక సంక్షేమ శాఖ మంత్రి సీవీ గణేశన్

## రెండు రేషన్ షాపుల ప్రారంభం

హోసూరు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): హోసూరు కార్పొరేషన్ పరిధిలోని 31వ వార్డు, 11వ వార్డు వసంతనగర్ ప్రాంతం, 7వ వార్డులోని అభివృద్ధి నిది నుంచి రూ.9 .60 లక్షల విలువైన రెండు కొత్త రేషన్ దుకాణాలు ప్రారంభించారు. మూవేందర్ నగర్‌లో ఎమ్మెల్యే ప్రాదేశిక అభివృద్ధి నిధుల నుంచి చౌకదుకాణాలు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే వై.ప్రకాశ్, మున్సిపల్ కార్యదర్శి మేయర్ సత్య చౌక దుకాణలను ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ ఛైర్మెన్ యువరాజు, డిప్యూటీ మేయర్ ఆనందయ్య, జోనల్ కమిటీ ఛైర్మెన్ రవి, కౌన్సిలర్లు మోసిన్ తాజ్, చెన్నీరప్ప, శ్రీనివాసులు, సంతోష్, నగర పాలక సంస్థ ఛైర్మెన్ సెందిల్ కుమార్, ఎన్విరాన్‌మెంట్ టీమ్ ఫైనార్టీ టీమ్ మాజీ ఆర్గనైజర్ ఇక్రమ్ అహమద్, విద్యార్థిని నాయన్ కమిటీ సభ్యుడు గోపాల్ కలైచెళియన్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.



రేషన్‌షాపును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్